## పదిరూపాయల నోటు

అప్పుడే వర్షంనిలచి రోడ్డంతా బురద బురదగావుంది. తీసుకున్న అప్పు తిరిగి యిచ్చేందు కెందుకంత తిప్పిస్తున్నాడని బయలుదేరాడు వెంకయ్య, సూరిశెట్టి దగ్గరికి. వెంకయ్య వెళ్లేటప్పటికి సూరిశెట్టి తీరిగ్గా కూర్చున్నాడు. వెంకయ్య వెళ్ళి కాస్త డబాయించడిగాడు అప్పు తీసుకున్న డబ్బు తిరిగి యిచ్చేయమని. సూరిశెట్టి వ్రాతపూర్వకంగా గుర్తులేదని డబ్బు కాజేదామని, నీదగ్గర యెప్పుడు తీసుకొన్నానయ్యా అప్పు అన్నాడు. వెంకయ్యకు లేనికోపం పుట్టుకొచ్చి పాదరక్ష తీసికొని నాల్గు తగిలించాడు. అప్పుడందరూ గుంపుగాచేరి వాళ్ళను పోలీసుస్టేషనుకుపట్టుకెళ్ళారు. పోలీసు స్టేషనులో కేసు రిజిష్టరుచేసికొని మరునాటి వుదయం కోర్టులో హాజరు కమ్మన్నారు. సూరిశెట్టికి కానివాళ్ళు వెంకయ్యశెట్టిని సెబాస్ అన్నారు. వెంకయ్యకు కానివాళ్ళు రేపు తెలుస్తుందిగా కోర్టులో అన్నారు.

ఆరోజు 11 గంటలకు సూరిశెట్టి, వెంకయ్య కోర్టులో హాజరు. జడ్జిగారు కేసు విచారించి వెంకయ్యకు 5 రూపాయలు జరీనామా విధించారు. 5 రూపాయలు జరీనామా విధించారనటంతోటే చటుక్కున వెంకయ్య బోనులోనుంచి యెగిరి మళ్లా సూరిశెట్టికి పాదరక్షతో మరినాల్గుతగిలించాడు. ఇదిచూచి కోర్టులోని వారంతా ఆశ్చర్యచకితులైరి. అక్కడున్న బంట్రోతులు వెంకయ్యను మఱల బోనులోనికి తీసుకెళ్లారు. జడ్జిగారు యెందుకు మళ్ళి సూరిశెట్టిని కొట్టావని యడుగగా; వెంకయ్య అన్నాడు "జడ్జిగారూ! నాదగ్గర పది రూపాయల నోటుంది. ఒక్కపర్యాయం కొట్టినందుకు 5 రూపాయలు జరీనామా విధించారు. రెండవ పర్యాయం కొట్టితే 10 రూపాయలు సరిపోతుందని మళ్ళీ కొట్టానండీ!" ఆమాటలు వినేసరికి కోర్టులోని వారందరూ గొల్లున నవ్వారు మన సూరిశెట్టి తప్ప.

"పెట్టినకోట"

* * *

## పంచదార పెరిమిట్టు

పంచదారమిల్లులనిండా పంచదార. బ్లాకుమార్కెట్లనిండా పంచదార. అధికారులయిండ్లనిండా పంచదార. ఇక "ఇందు కల డందు లేడని సందేహము వలదు" అన్నట్లు యెందుచూచినా పంచదారయే! అయినా ప్రజలకు మతిలేదు. "పంచదార లేక బాధపడిపోతున్నామో" అని పంచదారకొఱకు దరఖాస్తులు పెట్టుకొని, తాలూకాఫీసులో ప్రజలు తపస్సుచేస్తున్న రోజులవి. ఆ రోజులలో 'పంచదారపెరిమిట్టు తెచ్చుకుందికి రా రా బ్రదర్!' అంటూ మా జగన్నాథం నన్ను తాలూకాఫీసుకి తీసుకుపోయాడు. తహసీల్‌దారుగారు ఒక్కొక్కరినీ పిలచి, కొంచెము క్రాస్-యెగ్జామినేషన్‌చేసి, అందులకు నిలబడ్డవారికి, వారి దరఖాస్తులపై పావువీశ పంచదార కటాక్షించేవారు. కొంచం వేషములోనుండి, ఆంగ్లములో అప్లికేషన్ వ్రాసినవారికి, అరవీశ యిప్పించేవారు. ఇంక వుద్యోగస్తులను కొన్ని వీశలచే బహూకరించుచూ, అచ్చటికి వచ్చినవారి నందరినీ యిట్లు సమదృష్టితో, యెవరి హోదాకు తగ్గట్టు వారిని సంతోషపెడుతూ వచ్చారు ఆ ధర్మరాజ్ తహసీల్‌దార్‌జీ! ఇప్పుడు మా జగన్నాథం తహసీల్‌దారువారి దివ్యసముఖమునకు తన దరఖాస్తు పెట్టాడు. తహసీల్‌దారుగారు దరఖాస్తు చిత్తగిస్తూ హేళనగా "యేమోయ్! నీకు సత్యనారాయణవ్రతం చేసుకొనుటకు వీసెడు పంచదార కావాలా?" అన్నారు. మావాడప్పుడు గొంతుక సవరించుకొని "ధనికులపాల ధర్మరాజులై బీదలపాలిట యమ ధర్మరాజులుగా ప్రవర్తించే మీబోటి అధికార్లకు వేగరముగా ట్రాన్సుఫర్ అయేటందులకు సత్యనారాయణమూర్తివారికి రెండు వ్రతాలుచేయించుకొంటానని మ్రొక్కుకొన్నాను. కనుక మొదట ఒకవ్రతాన్ని అడ్వాన్సుగా చేసుకొందామని బుద్ధి వుట్టింది. అందుచే పంచదార పెరిమిట్టుకి వచ్చాను. ఇక మీచిత్తం మా భాగ్యం" అన్నాడు. దాంతో తహసీల్‌దారువారికి మతిపోయింది. నా కల కూడా అయిపోయింది. అప్పుడు ప్రక్కమీదనుంచి లేచి నాకు వచ్చిన కల అంతా నెమరువేసుకొని, మా జగన్నాథములాగ వున్నది వున్నట్లు చెబితే బాధిస్తుందనుకొని, దరఖాస్తు అతి వినయంగా వ్రాసుకొని తాలూకాఆఫీసునకు పంచదార పరిమిట్టుకొరకు వెళ్లాను. నాదరఖాస్తు తహసీల్‌దారుగారు చూచి "ఇన్ని కాఫీక్లబ్బులుంటూవుంటే విద్యార్థులకు పంచదార యెందుకు?" అని అన్నారు. ఈలాగ నాఒక్కని ఖర్మమే కాదు పెద్దలకు మ్రొక్కుకున్నామన్నా సరే, పసిపిల్లల పాలలోకన్నా సరే, ముసిలివాళ్లకు కాఫీలకన్నాసరే, యెవరేమన్నా సరే అందరికీ 'లేదు' అన్న పదముతో సంతోషపెట్టారు ఆ మహానుభావులు. కలలోని తహసీల్‌దారుకంటే యీనిజమైన తహసీల్‌దార్ వుద్దండపిండం. కనుక యిప్పుడు పంచదారవంటి బెల్లం కొనుక్కొని వుపయోగించుకొనుచున్నాము. ఈ బుద్ధే మాకు మొదట వుంటే ? ? ?

పి. ఎస్. నారాయణ.